సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



అర్జీలను పరిష్కరించండి
స్పందన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. 8లో



కేజీహెచ్ ఓపీ కౌంటర్లలో రద్దీ
కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్లు సోమవారం రద్దీగా కనిపించాయి. వెలుపల కూడా టోకెన్ల కోసం నిరీక్షించారు. 10లో



క్రీడాభివృద్ధిరస్తు..! 10లో
వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఒత్తిడి లేని చదువులు అందించేలా ప్రణాళికతో ముందుకెళ్తోంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఫార్మెటివ్ పరీక్షలు

విశాఖ విద్య: క్లాస్ రూం బేస్డ్ ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-3 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నాలుగు రోజుల పాటు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఎస్సీఈఆర్టీ ద్వారా జారీ చేసిన ప్రశ్నా పత్రంతోనే పరీక్షలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు నుంచి ఆయా ఎమ్మార్సీలకు ప్రశ్నా పత్రాలను పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన సమ్మెటివ్ పరీక్షల్లో విశాఖలోని కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ఎస్సీఈఆర్టీ ప్రశ్నా పత్రం కాకుండా, వారు సొంతంగా తయారు చేసుకున్న వాటితోనే పరీక్షలు నిర్వహించారు. తనిఖీ సమయంలో ఈ విషయాన్ని గుర్తించిన డిప్యూటీ డీఈవో సదరు విద్యా సంస్థల నిర్వాహకులను డీఈవో కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. మంగళవారం నుంచి జరగనున్న పరీక్షల్లో ఎస్సీఈఆర్టీ ప్రశ్నాపత్రం వినియోగించని విద్యా సంస్థలను ఉపేక్షించ వద్దని ఉన్నతాధికారులు ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖాధికారులు విస్తృత తనిఖీలకు సిద్ధమయ్యారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ కోర్సుల సిలబస్ పూర్తికానందున, కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి పరీక్షలను వాయిదా వేశామన్నారు. పరీక్షలు ఎప్పటి నుంచి నిర్వహించేది త్వరలో కళాశాలకు తెలియజేస్తామన్నారు.

ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రావు, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి చెందడమే తమ లక్ష్యమని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) స్టూడెంట్ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ డీఆర్ఎం రావు తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణతో కలిసి ఆయన ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు వంద మంది పైగా విద్యార్థులు ఈ విభాగంలో సభ్యత్వం తీసుకున్నారన్నారు. చాప్టర్ జాతీయ ఉపాధ్యక్షుడు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి యడవల్లి హేమ, సభ్యుడు పి.సునీల్ పాల్గొన్నారు.

9న భువనేశ్వర్-చెన్నై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: భువనేశ్వర్-చెన్నై (12830) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వ తేదీన 1.15 గంటలు ఆలస్యంగా 1.25 గంటలకు బయల్దేరుతుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఈ రైలు భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సి ఉండగా పలాస-విశాఖపట్నం సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు ఆధునీకరణ పనుల వల్ల రీ షెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

జీతాలు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు

ఇద్దరు కేజీహెచ్ ఉద్యోగులపై చర్యలు

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఇద్దరు ఉద్యోగులపై సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల జీతాల బిల్లు పెట్టేందుకు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై చర్యలకు ఉపక్రమించారు. ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై జూనియర్ అసిస్టెంట్ హరికుమార్‌ను సస్పెండ్ చేయగా, మరో జూనియర్ అసిస్టెంట్ వినోద్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పూర్తి విచారణకు ఆదేశించారు. కేజీహెచ్‌కు చెందిన 20 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు (తాత్కాలిక ఉద్యోగులు) ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో హరికుమార్, వినోద్ కుమార్ జీతాలు ఇప్పిస్తామని ఆ 20 మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. డబ్బులు సరిపోవని, మరికొంత ఇవ్వాలని బాధితులను డిమాండ్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, మేనేజర్ కె.ఎస్.శర్మ తదితరులు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌తో సంప్రదించి చర్యలకు ఉపక్రమించారు.

G20 మహా ముస్తాబు

భారత్ 2023 INDIA

Global Investors Summit 2023
Visakhapatnam
Advantage Andhra

ప్రతిష్టాత్మక సదస్సులకు ఆహ్వానం పలుకుతున్న విశాఖ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని ప్రపంచానికి సమగ్రంగా వివరించేలా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, ప్రపంచ దేశాల శిఖరాగ్ర సదస్సుగా జీ-20 సమ్మిట్ నగరంలో మార్చి నెలలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రతినిధులు ఆకర్షితులయ్యేలా విశ్వ నగరాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సమిష్టిగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో నిమగ్నమైంది.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు సిద్ధమవుతున్న ఏయూ ఇంజినీరింగ్ మైదానం

- రెండు అంతర్జాతీయ సదస్సులకు వేదికగా విశాఖ
- ఏయూ మైదానంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సదస్సు
- రుషికొండలోని హోటల్‌లో జీ 20 సదస్సు
- రూ.140 కోట్లతో మౌలిక సదుపాయలు, సుందరీకరణ పనులు
- నాలుగు బీచ్‌లలో ప్రాథమిక సౌకర్యాల కల్పన

సాక్షి, విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు మార్చి 3, 4 తేదీల్లో జరగనుంది. అదేవిధంగా జీ-20 సన్నాహాక సదస్సు మార్చి 28, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాల ప్రతినిధులు నగరానికి రానున్న నేపథ్యంలో కార్యనిర్వాహక రాజధానిగా రూపాంతరం చెందుతున్న వైజాగ్‌ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం రూ.135 కోట్లతో మహా విశాఖను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ డా.మల్లికార్జున మార్గదర్శకంలో 15 శాఖల ఆధ్వర్యంలో పనుల విభజన ప్రక్రియ మొదలైంది. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు ఇతర ముఖ్యమైన రోడ్లను అభివృద్ధి చేయడం, పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దడం, నగరమంతా దేదీప్యమానంగా విద్యుత్ వెలుగులు.. తదితర అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు.



రోడ్డు మధ్య ఉన్న మొక్కలకు హంగులు

సమ్మిట్‌కు చకచకా ఏర్పాట్లు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)-2023 జరగనుంది. ఇందుకోసం మైదానం చదును చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశ విదేశీ పెట్టుబడిదారులు హాజరయ్యే అవకాశం ఉంది. అదానీ, అంబానీ, మిట్టల్ తదితర ప్రముఖులు వచ్చే సూచనలు కనిపిస్తున్న తరుణంలో ఇంజినీరింగ్ మైదానంలో ఇప్పటికే ఉన్న మూడు హెలిప్యాడ్‌ల్లో కూడా పనులు పర్యవేక్షిస్తున్నారు. జర్మన్ హ్యాంగర్స్ షెడ్స్ ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచంలోని పలు ప్రముఖ సంస్థలకు చెందిన సుమారు 30 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. సదస్సు ఏర్పాటు పనులను టైమ్స్ గ్రూప్‌నకు ఏపీఐఐసీ అప్పగించింది. మైదానంలో సదస్సు కోసం తాత్కాలికంగా ప్రత్యేక గదులు, చర్చలకు ప్రత్యేకంగా, స్టాళ్లు, వివిధ వర్గాలకు భోజన సౌకర్యాల కోసం గదులు, గ్రీన్ రూమ్స్, విశ్రాంతి గదులు.. ఇలా భిన్నంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సదస్సు ముందు రోజు సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరానికి చేరుకొని తర్వాత రోజు సదస్సులో పాల్గొని సాయంత్రం బయలుదేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



బీచ్ రోడ్డులో గ్రీనరీ పనులు నిర్వహిస్తూ...

జీ-20 సదస్సుకు అంతర్జాతీయ అతిథులు

రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జీ-20 సన్నాహాక సదస్సు మార్చి 28, 29 తేదీల్లో జరగనుంది. దీనికి సంబంధించి కూడా సమగ్ర ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఏర్పాట్లను రెండు రోజుల పాటు పర్యవేక్షించారు. ఎక్కెడక్కడ ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలను కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దానికనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రపంచదేశాల నుంచి 250 మంది వరకూ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఒక్కొక్క జీ-20 సభ్యదేశం నుంచి ఆరుగురు, అంతర్జాతీయ సంస్థల నుంచి నలుగురు, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో 100 మంది హాజరుకానున్నారు. ఈ సదస్సులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు సమావేశాలు జరగనున్నాయి.

ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా..



రెండు ప్రతిష్టాత్మకమైన సదస్సులు నగరంలో జరుగుతున్న నేపథ్యంలో రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లకు సంబంధించిన పనుల విభజన ప్రక్రియ మొదలు పెట్టాం. ఇప్పటికే చాలా పనులు ప్రారంభమయ్యాయి. అతిథులకు ఆహ్వానం, ఆతిథ్యం, ఏర్పాట్లు, రవాణా తదితర అంశాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ప్రతి ఒక్క అంశాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. కమిటీలు ఏర్పాటు చేసి పనుల్ని పూర్తి చేస్తున్నాం. జీ-20, జీఐఎస్ సదస్సుల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ఏర్పాటు చేశాం. ఆయా పర్యాటక ప్రదేశాల వద్ద ఆహ్లాదకర పరిస్థితులు ఉండేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతినిధులకు భద్రత విషయంలోనూ రాజీ పడటం లేదు. ఈ నెలాఖరు నాటికి పనులను పూర్తి చేయనున్నాం.

– డా.మల్లికార్జున, కలెక్టర్

ప్రతి ప్రాంతం తళుక్కున మెరిసేలా..

- నగర పరిధిలోని 202.91 కిలోమీటర్ల మేర రహదారులను వీఎంఆర్‌డీఏ, విశాఖ పోర్టు ట్రస్టు, జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ శాఖల సమన్వయంతో రూ.70.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఎగ్జిబిషన్ల నిర్వహణ, ఇతర పనులు, జీఐఎస్, జీ-20 సదస్సుల వద్ద వసతుల సౌకర్యానికి రూ.33 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- ప్రతినిధులకు హోటల్స్‌లో రూమ్‌లు, ఏర్పాట్లు, ఆహార సదుపాయాలు మొదలైనవాటి కోసం రూ.7 కోట్ల వరకూ కేటాయించనున్నారు.



గోడలపై పెయింటింగ్

- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పర్యాటక ప్రాంతాల్లో ప్రాథమిక వసతులు, అభివృద్ధి పనులు, విద్యుత్ కాంతులు ఏర్పాటుకు రూ.18 కోట్ల వరకూ కేటాయించాలని నిర్ణయించారు.
- ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా రూ.9.50 కోట్లతో సిగ్నలింగ్ వ్యవస్థని, ప్రొటోకాల్, వాహన సౌకర్యం, భద్రత వ్యవస్థకు రూ.2 కోట్ల వరకూ ఖర్చుచేయనున్నారు.
- ఆర్‌కేబీచ్, జోడుగుళ్ల పాలెం, సాగర్‌నగర్, మంగమారి పేట బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు.
- మంగమారిపేట బీచ్‌లో పారా సెయిలింగ్, పారా బోటింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఈ సౌకర్యాల్ని సదస్సుల తర్వాత కూడా కొనసాగించాలని నిర్ణయించారు.
- ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో 500కి పైగా గదులను ఇప్పటికే బ్లాక్ చేశారు.

కోడి కథా చిత్రంతో ప్రకంపనలు

- సీఐ పేరుతో కానిస్టేబుళ్ల దందాపై సీపీ సీరియస్
- వ్యవహారంపై విచారణకు ఆదేశం

దొండపర్తి(విశాఖ దక్షిణ): 'ఖాకీ.. కోడి కథా చిత్రం' పోలీస్ శాఖలో ప్రకంపనలు రేపింది. సీఐ పేరు చెప్పి కానిస్టేబుళ్లు సాగించిన దందాపై నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. నగర శివారు పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాపారులను దోచుకున్న కానిస్టేబుళ్లు ఎవరన్న విషయంపై గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. శివారు స్టేషన్‌లో కొంత మంది కానిస్టేబుళ్లు సాగించిన దందాపై సాక్షి ప్రచురించిన 'ఖాకీ.. కోడి కథా చిత్రం' కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు.

ఐదుగురు కానిస్టేబుళ్లపై విచారణ?

పార్టీ వ్యవహారంలో ఐదుగురు కానిస్టేబుళ్ల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో పక్క స్టేషన్ ఎస్ఐ వీరిపై విచారణ చేపట్టారు. ఇందులో ఒకరు స్టేషన్ డ్యూటీలో ఉండగా.. మరో ఇద్దరు స్థానికంగా లేనట్లు గుర్తించారు. దీంతో వీరు కాకుండా మిగిలిన వారి పాత్రపై కూడా రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సిబ్బంది కాల్ డేటాను కూడా సేకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీని ప్రకారం కానిస్టేబుళ్ల ఎక్కడ ఉన్నారన్న విషయంతో పాటు వీరు ఏయే వ్యాపారులతో సంభాషించారన్న విషయం తెలిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందులో సీఐ పాత్రపై ఏసీపీ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ దందా వ్యవహారంలో నిజంగానే సీఐ పాత్ర ఉందా? లేదా? అతని పేరు మీద కానిస్టేబుళ్లే వ్యాపారులను దోచుకున్నారా? అన్న విషయంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

వ్యాపారుల నుంచి సమాచారం

ఆ స్టేషన్ పరిధిలో కొంత మంది వ్యాపారులను కలిసి ఈ వ్యవహారంపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎవరైనా డబ్బులు ఇవ్వకుండా సరుకులు తీసుకున్నారన్న విషయాలను తెలుసుకుంటున్నారు. అయితే వ్యాపారులు మాత్రం వీరి కోసం చెప్పేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఒక వేళ చెబితే తరువాత వారి నుంచి తమకు ఇబ్బందులు వస్తాయన్న భయంతో అధికారుల ముందు నోరు విప్పలేనట్లు సమాచారం. అయినా పోలీస్ ఉన్నతాధికారులు కానిస్టేబుళ్ల దందాపై విచారణ కొనసాగించాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆధారాలను లభించిన వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

వెంకన్నకు విశేషంగా శ్రీపుష్పయాగం



స్వామికి శ్రీపుష్పయాగాన్ని నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) ఉత్సవమూర్తులు

- ఘనంగా ఉంజనల్ సేవ
- పరవశించిన భక్తజనం
- ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామికి శ్రీపుష్పయాగం, ఉంజల్ సేవను విశేషంగా నిర్వహించారు. భక్తులు కనులారా ఈసేవలను తిలకించి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. వెంకన్న, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేంజేంపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, చక్రాభ్యమండల అర్చన, పాలికా అర్చన, ద్వాదశ ఆరాధనల సేవలను విశేషంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామికి పుష్పాంజలి సేవ చేశారు.

అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు ఉంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. అర్చకులు రాజీవ్‌లోచన్, భార్గవ్ తదితరులు ఈపూజలను నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు. వారంరోజుల పాటు జరిగిన కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ఘనంగా ముగిశాయి.

మహిళలను ప్రోత్సహిస్తేనే దేశాభివృద్ధి

- ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారు
- జెండర్ రెస్పాన్సివ్ వర్క్‌షాప్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పాల్గొన్న మహిళా ప్రజాప్రతినిధులు

కొమ్మాది : ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారని అందుకే నదులు పేర్లు కూడా వారి పేర్లమీదే ఉన్నాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రుషికొండలో నిర్వహిస్తున్న జెండర్ రెస్పాన్సివ్ వర్క్‌షాప్‌లో భాగంగా 'షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్' మహిళా ప్రజాప్రతినిధుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులిద్దరూ బండికి రెండు చక్రాలు వంటి వారని, సమాజంలో వారిని సమానంగా చూసిననాడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక వ్యక్తి చదువుకుంటే ఆ వ్యక్తికి మాత్రమే ఉపయోగపడుతుందని, ఒక స్త్రీ చదువుకుంటే కుటుంబమంతటికీ మేలు జరుగుతుందని చెప్పారు. మహిళలకు చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరముందన్నారు. మహిళలు శక్తి వంతంగా పనిచేయడానికి ఆర్థిక వనరులు కూడా సమకూర్చాలన్నారు. న్యాయకత్వంలో వైవిధ్యం, లింగ సమతుల్యత విలువను తక్కువగా అంచనా వేయకూడదని సూచించారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమన్ పాన్ ఇండియా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ మహిళా నేతల విజయాలకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ మాట్లాడుతూ మహిళా సాధికారిత లేకుండా ఎవరూ ఎదగలేరని, పార్లమెంట్‌కు ఎక్కువ మంది మహిళలు ఎన్నిక కావడానికి తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ దిశ పన్ను, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చదరంగంలో నవీన్ సత్తా



నవీన్‌కుమార్

విశాఖ స్పోర్ట్స్: దివ్యాంగులకు నిర్వహించిన తొలి ఫిడే ఒలింపియాడ్‌లో నగర చదరంగం క్రీడాకారుడు నవీన్‌కుమార్ సత్తాచాటాడు. సెర్బియాలోని బెల్‌గ్రేడ్‌లో ఈ పోటీలు నాలుగో తేదీతో ముగిశాయి. ఈ టోర్నీలో భారత్ జట్టు నాలుగో స్థానంలో నిలవగా... జట్టు తరఫున నగర క్రీడాకారుడు నవీన్‌కుమార్ ఆరు రౌండ్లలో ఐదు రౌండ్లు ఆడి రెండున్నర పాయింట్లు సాధించిపెట్టాడు. ఒకటి, మూడో రౌండ్లలో విజయం సాధించి.. ఐదోరౌండ్‌లో డ్రా చేసుకున్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర, ఆల్ విశాఖ చదరంగం సంఘం ప్రతినిధులు నవీన్‌కుమార్‌ను అభినందించారు.

'దిశ' పనితీరు ప్రశంసనీయం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



దిశ స్టాల్‌ను సందర్శించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఏపీ పోలీస్ దిశ యాప్ పనితీరు పట్ల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో ఒక హోటల్‌లో సోమవారం జరిగిన జాతీయ స్థాయి మహిళా సదస్సు చివరి రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన దిశ స్టాల్‌ను సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ అందిస్తున్న సేవలు, ఎస్‌వోఎస్ బటన్ పనితీరును ప్రశంసించారు. అలాగే నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ చైర్మన్ రేఖా శర్మతో పాటు సదస్సులో పాల్గొన్న ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రతినిధులకు దిశ యాప్ ప్రాముఖ్యతను, ఎస్‌వోఎస్ బటన్ పనితీరును వీడియో ద్వారా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి వివరించారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'షీ ఇజ్ ఏ చేంజ్ మేకర్' ప్రాజెక్టులో భాగంగా మహిళా ఎమ్మెల్యేలతో జరిగిన సదస్సులో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రారంభించిన దిశ సంబంధిత కార్యక్రమాలను వివరిస్తూ విశాఖ నగర పోలీసులు ఏర్పాటు చేసిన దిశ స్టాల్ మహిళా ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అప్లికేషన్‌లో అత్యంత స్వల్ప వ్యవధిలోనే 1,11,39,456 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం గొప్పవిషయని మహిళా ప్రజాప్రతినిధులు కొనియాడారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ఏపీ పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు గొప్పగా ఉన్నాయని ప్రశంసించారు.

సినీ పరిశ్రమ అభివృద్ధికి విశాఖ అనుకూలం



దర్శకుడు వీఎన్ ఆదిత్యను సత్కరిస్తున్న వీఎఫ్ఎస్ సభ్యులు

ఏయూక్యాంపస్: సినిమా పరిశ్రమకు కేంద్రంగా మారడానికి విశాఖ నగరానికి ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఉన్నాయని ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ హిందీ భవన్‌లో సోమవారం ఉదయం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విశాఖ నగరంతో పాటు, అరకు ప్రాంతాలు సినిమా చిత్రీకరణలకు ఎంతో అనువైన ప్రదేశాలన్నారు. జిల్లాలోని అందమైన ప్రాంతాల్లో మనసంతా నువ్వే సినిమాను చిత్రీకరించానని గుర్తు చేసుకున్నారు. విశాఖలోని మౌలిక సదుపాయాలు మరింతగా అభివృద్ధి చేస్తే సినిమా పరిశ్రమ వృద్ధి చెందుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎస్ఏడీ పాల్, గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మూడు రోజులు ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉచితంగా నిర్వహించే వర్క్‌షాప్‌లను యువ లఘు దర్శకులు, సినీప్రియులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యానారాయణ, వైజాగ్ ఫిలిమ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, సంతోష్ కుమార్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తరపున వీఎస్ ఆదిత్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ కష్టం.. సాయి పరిమళం

- జాతీయ స్థాయిలో ఉత్తమ వలంటీర్‌గా సాయికి పురస్కారం
- అభినందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి



రాష్ట్రపతి నుంచి వర్చువల్ విధానంలో ఎన్ఎస్ఎస్ అవార్డును స్వీకరిస్తూ.. (ఫైల్)



గవర్నర్ నుంచి ప్రశంసలు అందుకుంటూ



ముఖ్యమంత్రి జగన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటూ..

ఏయూక్యాంపస్ : జన్మనిచ్చిన అమ్మ..అన్నీ తానై నడిపించింది. అక్షర జ్ఞానం లేని అమ్మ తన బిడ్డను ఉన్నతంగా చదివించాలని ఆశ పడింది. సినిమా ట్విస్టులను తలపించే కష్టాలు ...పూట గడవడం కష్టమైన సమయంలో ధైర్యంగా ఆ తల్లి అడుగేసింది. రైతు బజార్‌లో పూల వ్యాపారిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి, కష్టాలను, కన్నీళ్లను దిగమింగింది. పెదవాల్తేరు రైతుబజార్‌లో పూల రైతుగా ఉన్న ధనియాల రమణమ్మ జీవితం గులాబి పూల వెనుక దాగివున్న ముళ్ల వంటిదే. తనకు ఏకైక ఆధారంగా ఉన్న కుమారుడు ధనియాల సాయిని ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ ఎకనామిక్స్ చదివించింది. అదే సమయంలో అమ్మ కష్టం తెలుసుకున్న సాయి విద్యార్థిగా విశ్వవిద్యాలయంలో క్రమశిక్షణతో నడుచుకున్నాడు.

27 సార్లు రక్తదానం

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదివే సమయంలో తన గురువు దాసరి నారాయణ రావు స్ఫూర్తితో జాతీయ సేవా పథకం వలంటీర్‌గా సాయి చేరాడు. సమాజానికి సేవ చేయాలని, సమాజ ప్రగతిలో భాగం కావాలనే ఆలోచన తన గురువు నారాయణ రావునుంచి అందుకుని జాతీయ సేవా పథకం నిర్వహించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అలవాటుగా మార్చుకున్నాడు. జాతీయ సమైక్యత శిబిరాలలో రాంచీ, గుల్బర్గా, జార్ఖండ్, బెంగళూరు, హైదరాబాద్‌లలో పాల్గొన్నారు. కళాశాల, విశ్వవిద్యాలయం తరఫున నిర్వహించిన రక్తదాన శిబిరాలలో పాల్గొని ఇప్పటి వరకు 27 సార్లు కర్తదానం చేశాడు.

రాష్ట్రపతి పురస్కారం

జాతీయ సేవా పథకం వలంటీర్‌గా చేసిన సేవలకు 2018–19 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ వలంటీర్‌గా సాయిని ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందించింది. తరువాత 2019–20 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉత్తమ వలంటీర్‌గా ఎంపికై అవార్డును 2021లో అప్పటి రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ల నుంచి అభినందనలు అందుకున్నారు.

అమ్మకు చేదోడుగా..



తల్లితో కలిసి పువ్వులు అమ్ముతూ..

అనారోగ్యంతో నాన్న, చెల్లెలి మరణం సాయి కుటుంబాన్ని కష్టాలలోకి నెట్టేసింది. చెల్లెలి చికిత్సకు చేసిన అప్పులు కుటుంబానికి భారంగా మారాయి. అమ్మకు అండగా నిలుస్తూ తన విద్యాభ్యాసాన్ని సాయి పూర్తిచేశాడు. రాష్ట్రపతి పురస్కారం అందుకున్న తరువాత కూడా రైతుబజార్‌లో పూల దుకాణంలో అమ్మకి తోడుగా, సాయంగా సాయి వస్తుంటారు. వృత్తిని దైవంగా భావిస్తూ అమ్మకు అండగా నిలుస్తూ ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట : స్పందనలో స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ పిటీషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు.

స్పందన ద్వారా ప్రజలకు మరింత మేలు చేసే విధంగా ''జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని త్వరలో ప్రభుత్వం రూపకల్పన చేయనుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సంబంధించి ఆమోదించిన పనులు వెంటనే పూర్తి చేసి, వాటి బిల్లులు సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సోమవారం నాటి స్పందనకు 195 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై ఫిర్యాదు

పద్మనాభం మండలంలో రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆ మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ములపర్తి పైడిరాజు కోరారు. స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వీఆర్వో, వీఆర్‌ఏలు అక్రమాలకు పాల్పడుతున్నారని, కబ్జా చేసిన స్థలాలను తిరిగి విక్రయిస్తున్నారని, ఈ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి



రోడ్డును ఆక్రమించి నిర్మాణం

గాజువాక మండలం భానోజీతోట సర్వే నంబరు 86లో కొండ పోరంబోకు భూమిలో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పి.రాధాకృష్ణ మాదిగ కలెక్టర్‌ను కోరారు. రోడ్డు ఆక్రమించడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ స్థలం ఆక్రమణ



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న సాయినగర్ లేఅవుట్ లబ్ధిదారుడు

మధురవాడ సాయి నగర్ లేఅవుట్‌లో ఖాళీ స్థలాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడని, చర్యలు తీసుకోవాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. లేఅవుట్‌లో లబ్ధిదారులంతా కలెక్టర్, జేసీని కలిసి వినతి పత్రం సమర్పించారు. 2001లో వుడా ఎల్‌పీ నంబర్‌తో అనేక మంది లబ్ధిదారులు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నామని, ఇటీవల తెలుగుదేశంపార్టీ నాయకుడు పార్కుకు కేటాయించిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారని వారు ఆవేదన చెందారు. మధురవాడ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధితులు పేర్కొన్నారు.

జీవీఎంసీ స్పందనకు 70 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంయుక్తంగా నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 70 వినతులు వచ్చాయి. వీటిలో జోన్–1 నుంచి రెండు, జోన్–2 నుంచి ఎనిమిది, జోన్–3 నుంచి పది, జోన్–4 నుంచి తొమ్మిది, జోన్–5 నుంచి పది, జోన్–6 నుంచి పదహారు, జోన్–8 నుంచి మూడు, ప్రధాన కార్యాలయానికి 12 అర్జీలు వచ్చాయి. వీటిలో పరిపాలన, అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూకి 7, ప్రజారోగ్యానికి 7, టౌన్‌ప్లానింగ్‌కు 30, ఇంజనీరింగ్/హార్టికల్చర్‌కు 16, యూసీడీకి 6 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి వచ్చిన ఫిర్యాదులను 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మేయర్, కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీడీ(హార్టికల్చర్) ఎం దామోదరరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి, పర్యవేక్షక ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 59 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 59 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పైడిరాజుకు కన్నీటి వీడ్కోలు



పైడిరాజు అంతిమ యాత్రలో సహచరులు

అల్లిపురం (విశాఖ దక్షిణం): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించిన జ్ఞానాపురం, శ్మశానవాటిక కాటికాపరి పైడిరాజు అంత్యక్రియలు సోమవారం సాటి కాటికాపరులు, శ్మశానవాటిక సిబ్బంది నిర్వహించారు. 15 ఏళ్ల పాటు అనాథ శవాలకు పైడిరాజు అన్నీ తానై అంతిమ సంస్కారాలు నిర్వహించి పలువురి అభినందనలు అందుకున్నాడని సహచరులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కేజీహెచ్ మార్చురీ నుంచి భారీ ఊరేగింపుగా శ్మశనవాటికకు తీసుకొచ్చి తమ అభిమానాన్నిచాటుకున్నారు.

తీరానికి చేరిన యువరాజ్ మృతదేహం

బీచ్‌రోడ్డు: ఆదివారం సాయంత్రం సముద్రంలో గల్లంతైన యువరాజ్ మృతదేహం సోమవారం సాయంత్రం తీరానికి కొట్టుకువచ్చింది. కంచరపాలెంకు చెందిన చిన్నం యువరాజ్ (16) ఆదివారం పార్క్ హోటల్ వెనుకవైపు సముద్రంలో స్నేహితులంతాం ఒంతా స్నానాలకు దిగి గల్లంతయ్యాడు. బీచ్ పోలీసులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం మృతదేహం గల్లంతైన తీరానికి కొట్టుకువచ్చినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు.

నేడు కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): దక్షిణ మధ్యరైల్వే పరిధిలో జరుగుతున్న కార్యనిర్వాహక పనుల నిమిత్తం మంగళవారం కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ (17267/17268) మెము ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి ముగింపు సభ
- ఉదయం 10 గంటలకు గ్రిండలె స్కూల్‌లో వాక్‌థాన్‌ను ప్రారంభించనున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,440
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,650
వెండి(కిలో):	రూ.74,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	460.00
విజయనగరం	464.00
శ్రీకాకుళం	464.00

అనకాపల్లి ఆర్టీసీకి రూ.9.11 లక్షల ఆదాయం

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది మాఘపౌర్ణమిని పురస్కరించుకొని ప్రజా రవాణా వ్యవస్థ (ఆర్టీసీ) అనకాపల్లి డిపోకు రూ.9 లక్షల 11 వేల 302 ఆదాయం లభించిందని జిల్లా రవాణాశాఖ (డీటీపీవో) అధికారి పద్మావతి సోమవారం వెల్లడించారు. అనకాపల్లి–పూడిమడక ప్రత్యేక బస్సుల ద్వారా మంచి ఆదాయం సమకూరిందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు.

ప్రక్షాళన.. పరిరక్షణ

- 108 ఎకరాలకు పైగా ఏయూ భూములు ప్రక్షాళన
- దశాబ్దాలుగా అన్యాక్రాంతమైన భూములు తిరిగి ఏయూకు
- విద్యార్థులకు ఉపయుక్తంగా క్రీడా మైదానాలుగా మార్పు
- దాతల సహాయంతో మైదానాలు ఆధునికీకరణ



క్రీడా మైదానం వెనుక భాగంలో శుభ్రం చేసిన సువిశాల స్థలం

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న భూములను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. ఏయూ నార్త్, సౌత్ క్యాంపస్‌లతో పాటు, శివాజీపాలెం, బీచ్‌రోడ్డులో ఉన్న విలువైన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన అసమతుల్యంగా, నిరుపయోగంగా ఉన్న వందలాది ఎకరాలను మైదానాలుగా తీర్చిదిద్దారు. అసాంఘిక శక్తులకు నిలయంగా మారిన భూములను అందమైన క్రీడా మైదానాలుగా తీర్చిదిద్ది విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీలో ఖాళీ భూములను ప్రక్షాళన చేయడంతో పాటు అన్యాక్రాంతమైన కోట్ల రూపాయలు విలువైన భూములను స్వాధీనం చేసుకుని మరోవైపు వాటిని పరిరక్షించే చర్యలు సైతం చేస్తున్నారు.

నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మధ్యలో సువిశాలమైన ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ పొదల మాటున రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగడం పరిపాటిగా మారిపోయింది. ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో చదునుచేసి అసాంఘిక శక్తులకు స్థానం లేకుండా చేశారు. అక్కడ ప్రారంభమైన ఈ ప్రక్షాళన కార్యక్రమం దాతల సహకారంతో ముందుకు సాగింది. కేవలం ఇంజినీరింగ్ కళాశాల నార్త్ క్యాంపస్‌లో 78 ఎకరాలకు పైగా భూములను అధికారులు గుర్తించి శుభ్రం చేసి వర్సిటీని ఉపయుక్తంగా తీసుకువచ్చారు. దీంతో ఇక్కడ ప్రత్యేకంగా మూడు హెలీపాడ్‌లు కలిగిన మైదానం ఒకటి, భారీ సమావేశాలు నిర్వహించడానికి అనువుగా రెండు మైదానాలు ఏర్పడ్డాయి. నూతనంగా అభివృద్ధి చేసిన మైదానానికి ఇటీవల చిన జీయర్‌స్వామి ఉర్జ (శక్తి) అని నామకరణం చేశారు. ఇదే మైదానంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కూడా జరిగింది.

అన్యాక్రాంతమైన భూములు ఏయూ చెంతకు..

దాదాపు మూడు దశాబ్దాలకు పైగా అన్యాక్రాంతమైన పోలమాంబ ఆలయానికి ఆనుకుని ఉన్న అత్యంత విలువైన భూములను ఏయూ తిరిగి తన ఆధీనంలోనికి తెచ్చుకుంది. రెండెకరాలకు పైగా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రూ.300 కోట్లు విలువైన స్థలాన్ని ఏయూ ఇటీవల స్వాధీనం చేసుకుంది. భవిష్యత్తులో అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీని సైతం నిర్మించింది. దీనికి ఆనుకుని దాదాపు ఐదారెకరాల మైదానాన్ని వాణిజ్య కార్యక్రమాల నిర్వహణకు ఉపయుక్తంగా మలిచారు. తద్వారా ఏయూకు ఆర్థిక పరిపుష్టికి ఇవి ఉపకరిస్తున్నాయి.

సౌత్ క్యాంపస్‌పై దృష్టి

నార్త్ క్యాంపస్ ప్రక్షాళన పూర్తయిన తరువాత వర్సిటీ అధికారులు సౌత్ క్యాంపస్‌పై దృష్టిసారించారు. బీచ్‌రోడ్డులో కన్వెన్షన్ సెంటర్ వెనుక భాగంగా సువిశాలమైన 15 ఎకరాల మైదానాన్ని తీర్చిదిద్దారు. ఇది మంచి ఆదాయ వనరుగా ఏయూకి మారింది. ఏయూ హెల్త్ సెంటర్ వెనుక భాగంలో దాదాపు 8 ఎకరాలను గుర్తించి, శుభ్రం చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ స్థలాలను డంపింగ్ యార్డులుగా, ఇతరులు తమ వ్యక్తిగత అవసరాలను ఇష్టారాజ్యంగా వినియోగించుకోవడం అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేసే పనిలో అధికారులు ఉన్నారు. అదే విధంగా మహిళా ఇంజినీరింగ్ కళాశాల వెనుక భాగంలో దాదాపు 8 ఎకరాల ఖాళీ స్థలాలను చదును చేశారు. ఇక్కడ 2.5 ఎకరాల స్థలంలో సుందరమైన పార్క్‌ను అభివృద్ధి చేయడానికి లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ ముందుకు వచ్చింది. తాజాగా సౌత్ క్యాంపస్‌లో ప్రతి విభాగం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించే పనులు జరుగుతున్నాయి.



మైదానంలో పనులు జరుగుతున్న దృశ్యం

దాతల సహకారంతో....

ఆంధ్రవిశ్వవిద్యాలయం మైదానాల పరిరక్షణ పనులు పూర్తిగా దాతల సహకారంతో చేస్తున్నారు. వర్సిటీ పరంగా దీనికి రూ25 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. నగరానికి చెందిన లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు వై.ఏసుపాదం, రాజా రెడ్డి, యు.ఆర్.కె రాజు (మారుతి రాజు)లు తమ సొంత డబ్బులు ఖర్చుచేసి వీటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. వర్సిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా భారం లేకుండా పూర్తిగా దాతల సహాయంతో వీటిని చేయడం విశేషం. విశ్వవిద్యాలయాన్ని వ్యర్థాల రహితంగా, పరిశుభ్రమైన, సుందరమైన క్యాంపస్‌గా తీర్చిదిద్దే పనులు పూర్తికా వస్తున్నాయి. వర్సిటీలో పేరుకుపోయిన 300 లారీల వ్యర్థాలను సైతం తొలగించారు.

వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తాం

ప్రస్తుతం వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో హెలీపాడ్ గ్రౌండ్, ఉర్జా మైదానం, పోలమాంబ మైదానం, బీచ్‌రోడ్డులో మెరైన గ్రౌండ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం. ప్రధాన మైదానాలలో ప్రజలకు ఉపయుక్తగా వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేస్తాం. జూన్ నుంచి వర్సిటీ మైదానాలచుట్టూ భారీగా మెక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తాం.

– ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, ఉపకులపతి, ఏయూ